## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 24: విద్యుత్ లైన్ మరమ్మతు పనుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈలు వాణి, చైతన్య, భీమలింగప్ప తెలిపారు.

**వసంత నగర్ సెక్షన్ లో..** నేడు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సర్దార్ పటేల్ నగర్, సాయి నగర్, వసంత నగర్, హైదర్ నగ ర్ మెయిన్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో... మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సీబీసీఐడీ కాలనీ, ఎన్ ఆర్ఎస్ఏ కాలనీ, ఎస్ఎస్ కాలనీ, హైదర్ నగర్ మెయిన్ రోడ్డు పరిసరాల్లో...

**కూకట్‌పల్లి సెక్షన్ లో..**ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు బాలకృష్ణ నగర్ శ్రీకృష్ణ నగర్ లక్ష్మీ నగర్ వెంకట్రావు నగర్ స్మశాన వాటిక పరిసరాల్లో.. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రామాలయం టెంపుల్, విశాల్ టవర్స్, బాగ్‌అమీర్, సుమిత్ర నగర్ పరిసరాల్లో..

**బాలాజీ నగర్ సెక్షన్ లో..** ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కేపీహెచ్‌బీ కాలనీ 7వ ఫేజ్ అంకుర వైద్యశాల వెనకాల, చిట్కో అపార్ట్‌మెంట్ పరిసరాల్లో.. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కాలనీ 4వ ఫేజ్ ఆర్టీవో ఆఫీస్ పరిసర ప్రాంతాల్లో సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

మియాపూర్ : 11 కేవీ పీజేఆర్ నగర్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా జన్మభూమి కాలనీ, కమలమ్మ కాలనీ, మహావీర్ నగర్, శివమ్మ కాలనీ, పీజేఆర్ నగర్, సుభాష్ చంద్రబోస్ నగర్‌లో బుధవారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, 11 కేవీ పద్మావతి నగర్ ఫీడర్ పరిధిలో భాగ్యనగర్ కాలనీ, పద్మావతి ప్లాజా, ఆర్టీసీ క్యాష్ కౌంటర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి 5 గంటలు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మంగళవారం తెలిపారు.

# మౌలిక వసతుల కల్పనకు కృషి



ఎమ్మెల్యే వివేకానంద్‌ని కలిసిన ఏరో నగర్ వాసులు



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసిన నాయకులు, కాలనీ వాసులు

దుండిగల్, జూన్ 24 : కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని బీఆర్ఎస్ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. గాజుల రామారం డివిజన్, ఏరోనాటిక్స్ ఎంప్లాయీస్ కో– ఆపరేటివ్ సొసైటీ – ఏరో నగర్ (ప్రగతి నగర్) సంక్షేమ సంఘం సభ్యులు పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే వివేకానంద్‌ను మంగళవారం కలిసి కాలనీలోని మౌలిక వసతుల కల్పనపై వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే వివేకానంద్ మాట్లాడుతూ.. పదేండ్లలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు డివిజన్లు, వార్డుల్లోని అనేక ప్రాంతాల్లో మౌలిక వసతులను కల్పించామని, రానున్న రోజుల్లో ఏరో నగర్‌లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఏరో నాటిక్స్ ఎంప్లాయీస్ కో– ఆపరేటివ్ సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే లక్ష్యం

దుండిగల్ : ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, శంభీపూర్‌లోని ఆయన కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన పలువురు జీహెచ్ఎంసీ కార్పొరేటర్లు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, యువకులు, వివిధ కాలనీల సభ్యులు ఎమ్మెల్సీని కలిశారు. తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్సీ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కారమయ్యేలా చూస్తానన్నారు.

## మాదకద్రవ్యాలతో కుటుంబాలు చిన్నాభిన్నం




ర్యాలీలో పాల్గొన్న ఏసీపీ రవికిరణ్ రెడ్డి, ఎస్‌హెచ్‌ఓలు రాజేశ్, రాజశేఖర్ రెడ్డి

మూసాపేట : మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని కూకట్‌పల్లి ఏసీపీ రవికిరణ్ రెడ్డి సూచించారు. కుటుంబాలను చిన్నాభిన్నం చేసుకోవద్దని తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగంతో జరిగే అనర్థాలపై పోలీసుల ఆధ్వర్యంలో స్టేషన్ పరిధిలోని కళాశాలల విద్యార్థులకు అవగాహన కల్పించారు. కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ నుంచి జేఎన్టీయూ కళాశాల వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. మాదకద్రవ్యాలు విక్రయించిన, వినియోగించిన నేరమని శిక్షలు తప్పవని హెచ్చరించారు. ఎవరైనా విక్రయిస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారమివ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్‌ఓ రాజేశ్, కేపీహెచ్‌బీ ఎస్‌హెచ్‌ఓ రాజశేఖర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యను పరిష్కరించాలి



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సబిహా బేగం

అల్లాపూర్ : తాగునీటి సమస్యను పరిష్కరించాలని కార్పొరేటర్ సబిహాబేగం అధికారులను కోరారు. మంగళవారం వివేకానంద నగర్, జనప్రియ నగర్ కాలనీలో జలమండలి అధికారులతో కలిసి కార్పొరేటర్ పర్యటించారు. లో ప్రెషర్‌తో నీరు సరిగా రావడంలేదని, ఆరు నెలలుగా నీళ్లు కొనలేక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రెషర్ పెంచడంతో పాటు గంట సేపు నీటి సరఫరా చేయాలని జలమండలి అధికారులకు సూచించారు.

## మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్, పోలీసులు

దుండిగల్, జూన్ 24 : మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ, మెప్మా ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మంగళవారం ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహిళ సంఘాల సభ్యులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను కమిషనర్‌తో పాటు దుండిగల్ సీఐ పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని, మరొకరికి ఉపాధి కల్పించేలా ఎదగాలన్నారు. కార్యక్రమంలో దుండిగల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సతీశ్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ సతీశ్, మున్సిపల్ మేనేజర్ లక్ష్మయ్య, మెప్మా సీవో మంజుల, ఆర్పీలు శాంత, రాణి, మల్లేశ్వరి, అరుణ, నాగమణి, ఆదిలక్ష్మి, మెప్మా సంఘాల సభ్యులు, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఎం ఫార్మసీ పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎం ఫార్మసీ పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎం ఫార్మసీ(పీసీఐ)(ఆల్ స్పెషలైజేషన్స్) నాలుగో సెమిస్టర్ పరీక్ష ఫీజును ఈ నెల 30వ తేదీలోగా సంబంధిత కళాశాలలో చెల్లించాలని చెప్పారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు, పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవాలని సూచించారు.

## హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ : ఓయూ పరిధిలోని హోటల్ మేనేజ్మెంట్ కోర్సులు(బీహెచ్ఎంసీటీ, బీసీటీసీఏ) పూర్తి చేసి బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు మిగిలిన వారికి వన్‌టైం చాన్స్ కల్పించారు. ఈ మేరకు ఓయూ అకాడమిక్ సెనేట్ స్టాండింగ్ కమిటీ అనుమతించిందని, 2000 తరువాత ఆయా కోర్సుల్లో చేరినవారు సైతం తమ బ్యాక్‌లాగ్ పరీక్షలకు హాజరయ్యేందుకు అవకాశమిచ్చామని అధికారులు తెలిపారు. ఈ కోర్సుల అన్ని సెమిస్టర్ల పరీక్షా ఫీజును వ చ్చే నెల 14వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని సూచించారు. అన్ని కోర్సుల పరీక్షలకు సాధారణ పరీక్షా ఫీజుతోపాటు పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుందన్నా రు. ప్రస్తుతం ఉన్న సిలబస్, పరీక్షా విధానంలోనే వారు పరీక్షలకు హాజరుకావాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ పరీక్షలను ఆగస్టు నెలలో నిర్వహించనున్నట్లు తెలిపా రు. పరీక్షా తేదీల వివరాలు త్వరలో ప్రకటిస్తామన్నారు.

## జవాబుపత్రాల నకలుకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ : ఓయూ పరిధిలోని వివిధ పీజీ కోర్సుల పరీక్షల జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకామ్, ఎంఎస్ డబ్ల్యూ, ఎంలిబ్ఐఎస్సీ, ఎంజేఅండ్ఎంసీ, ఎంకామ్(ఐఎస్) తదితర కోర్సుల మొదటి, మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని అధికారులు చెప్పారు. జవాబుపత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపరు రూ.వెయ్యి చొప్పున చెల్లించి ఈనెల 28వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ ఫలితాలపై చాలెంజ్ వాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కోపేపర్‌కు రూ.10వేలు చొప్పున చెల్లించి వచ్చే నెల 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, వివరాలు ఓయూ వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని సూచించారు.

## డిగ్రీ కోర్సుల ఇన్‌స్టంట్ పరీక్షా తేదీల ఖరారు

ఓయూ పరిధిలోని డిగ్రీ కోర్సుల ఇన్‌స్టంట్ పరీక్షా తేదీలను ఖరారు చేశారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ తదితర కోర్సుల ఆరో సెమిస్టర్ ఇన్‌స్టంట్/ మేకప్ పరీక్షలను వచ్చేనెల 18వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పరీక్ష తేదీల వివరాలు వెబ్సైట్‌లో చూసుకోవాలన్నారు.

## పరిశుభ్రతతోనే దోమల నియంత్రణ



పాఠశాలలో అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంటామాలజీ సిబ్బంది

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 24 : దోమలను నియంత్రించాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంటామాలజీ ఫీల్డ్ అసిస్టెంట్ మహేందర్ రెడ్డి సూచించారు. మంగళవారం కేపీహెచ్‌బీ కాలనీ 6వ ఫేజ్ సాయి ఇంగ్లిష్ పాఠశాలలో సర్కిల్ ఎంటామాలజీ సిబ్బంది ఆధ్వర్యంలో దోమల నియంత్రణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వకుండా చూడాలని, పూలకుండీలు, టైర్లు, నిరుపయోగ వస్తువుల్లో నీటినిల్వలు లేకుండా చూడాలన్నారు. నీటి ఆవాసాలపైనే దోమలు వృద్ధి చెందుతాయని, వాటిని నియంత్రించేందుకు విద్యార్థులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రామారెడ్డి, ఇన్‌చార్జి శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఎంటామాలజీ సిబ్బంది పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణకు..సీసీ కెమెరాలు



సమావేశంలో మాట్లాడుతున్న కూకట్‌పల్లి ఏసీపీ రవికిరణ్ రెడ్డి

అల్లాపూర్ : సీసీ కెమెరాలతో నిఘా ఉంటుందని, నేరాల నియంత్రణ దోహదపడతాయని కూకట్‌పల్లి ఏసీపీ రవికిరణ్ రెడ్డి అన్నారు. అల్లాపూర్ డివిజన్ పరిధి ఎస్బీఐ బ్యాంక్ కాలనీలోని విష్ణు విస్తారా గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్‌లో మంగళవారం అల్లాపూర్ సీఐ వెంకటరెడ్డితో కలిసి నూతనంగా ఏర్పాటు చేసిన 36 సీసీ కెమెరాలను ఏసీపీ రవికిరణ్ రెడ్డి ప్రారంభించారు. ఏసీపీ మాట్లాడుతూ.. సీసీ కెమెరాలుతో నిఘా ఉంటుందని, ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమన్నారు. భాగ్యనగర్ సొసైటీ అసోసియేషన్ సభ్యులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని ఏసీపీ అన్నారు. కార్యక్రమంలో భాగ్యనగర్ సొసైటీ అధ్యక్షుడు ఉమారెడ్డి, ప్రసాద్, రంగనాథ్ పాల్గొన్నారు.

## మున్నూరుకాపు సంఘం కార్యదర్శిగా సిద్ధిరాములు



నియామక పత్రం అందుకుంటున్న సిద్ధిరాములు

కుత్బుల్లాపూర్, జూన్ 24 : తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంఘం కార్యదర్శిగా కుత్బుల్లాపూర్ ప్రాంతానికి చెందిన కుంట సిద్ధిరాములు ఏకగ్రీవంగా నియామకమయ్యారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవన్న, మేడ్చల్ జిల్లా మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు బూరుగుబావి హనుమంతరావు, నూతనంగా పటేల్ సంఘం నుంచి ఉపాధ్యక్షులుగా బాధ్యత తీసుకున్న బూరుగుబావి సత్యనారాయణ, కుత్బుల్లాపూర్ నియోజక వర్గం మున్నూరు కాపు సంఘం లక్ష్మీనారాయణ నియామక పత్రం అందజేసి సిద్ధిరాములును సన్మానించారు.

## స్కూల్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

మియాపూర్ : స్కూల్ బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మియాపూర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకున్నది. బీహెచ్‌ఈఎల్, ఎల్ఐజీ కాలనీలో పారిపెల్లి పవన్ కుమార్(43), భార్య సంధ్యారాణి, ఇద్దరు కూతుర్లతో ఉంటున్నారు. భాగ్యనగర్ గ్యాస్ ఏజన్సీలో పనిచేస్తున్నాడు. కొండాపూర్‌లో పని ముగించుకొని పవన్ యూనికాన్ ద్విచక్ర వాహనపై మియాపూర్ వైపు వస్తున్నాడు. హఫీజ్‌పేట్ ఫ్లై ఓవర్ సమీపంలో రాగానే వెనక నుంచి చిరాక్ స్కూల్ బస్సు డ్రైవర్ నోహన్ అజాగ్రత్తగా బస్సు నడుపుతూ పవన్ వాహనాన్ని ఢీ కొట్టాడు. దీంతో పవన్ కిందపడగా తలకు తీవ్ర గాయాలు కాగా.. స్థానికులు కొండాపూర్ ఏరియా దవాఖానకు తరలించారు. డాక్టర్లు పరీక్షించి మృతి చెందాడని నిర్ధారించారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉన్నది.

## యువతి ఆత్మహత్య

శేరిలింగంపల్లి : ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన రాయదుర్గం పీఎస్ పరిధిలో చోటుచేసుకున్నది. ఇన్స్‌పెక్టర్ వెంకన్న తెలిపిన ప్రకారం.. నల్లగండ్లలో ఉండే బ్యూటీషియన్ జి.అనూష (26)కు వివాహ కాగా.. భార్యాభర్తలు వేరుగా ఉంటున్నారు. అనూష తల్లిదండ్రుల వద్దనే ఉంటోంది. 22న సాయంత్రం స్నేహితుల వద్దకు వెళ్తున్నానని చెప్పి వెళ్లింది. రాత్రి ఫోన్ చేసినా స్పందించలేదు. సోమవారం సాయంత్రం గచ్చిబౌలిలోని క్యాబిన్ ఓయో లాడ్జిలో ఆత్మహత్యకు పాల్పడిందని పోలీసులు సమాచారం అందించారు. సీలింగ్‌ఫ్యాన్‌కు కర్టన్‌తో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిందని కారణాలు తెలియరాలేదన్నారు. సంతోష్ మొదట సమాచారం అందించాడని, ఆత్మహత్యపై అనుమానాలున్నాయని ఆమె సోదరుడు రాజు ఫిర్యాదు చేశారు.

**అనుమానాస్పద స్థితిలో ..**

కుత్బుల్లాపూర్ : అనుమానాస్పద స్థితిలో యువతి మృతిచెందిన ఘటన పేట్ బషీరాబాద్ పీఎస్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంపల్లి అపర్ణ మెడోస్ విల్లా 229 లో శ్రీనివాసరావు ఇంట్లో నేపాల్‌కు చెందిన రీసాచౌదరి (21) మేడ్‌గా పని చేస్తున్నది. మంగళవారం ఉదయం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ దవాఖానకు తరలించారు. మృతురాలి తల్లిదండ్రులు అనారోగ్యంతో బాధపడుతున్న తరుణంలో మనస్థాపానికి గురై మృతి చెందినట్లు చెప్పినట్లు సమాచారం.

# జీహెచ్ఎంసీ పార్కు స్థలంపై రగడ



బ్యాంక్ కాలనీలో వివాదాస్పదంగా మారిన పార్కు స్థలం

కుత్బుల్లాపూర్, జూన్ 24 : కుత్బుల్లాపూర్ నియోజక వర్గం జీడిమెట్ల డివిజన్ బ్యాంక్ కాలనీలో పార్కు స్థలాన్ని కొందరు కబ్జా చేసేందుకు పూనుకున్నారు. అదే స్థలంలో ఆరు లక్షల రూపాయలతో పార్కు స్థలం చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మాణం కోసం ఇటీవల జీహెచ్ఎంసీ నిధులు విడుదల చేసింది.

ప్రహరీ నిర్మాణ పనులు చేపడుతున్న క్రమంలో కొందరు ఆ స్థలం మాది అంటూ మున్సిపాలిటీ అధికారులు సంబంధిత కాంట్రాక్టర్‌తో వాగ్వాదానికి దిగారు. దీంతో కుత్బుల్లాపూర్ ఇంజినీరింగ్ సెక్షన్ అధికారులు పేట్ బషీరాబాద్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. స్థలాన్ని కాజేసేందుకు ప్రైవేట్ వ్యక్తులు కోర్టును ఆశ్రయించగా.. మున్సిపాలిటీ అధికారులు అది పార్కు స్థలమే అంటూ పోలీసులను ఆశ్రయించి బ్యాంకు కాలనీలో రోడ్ నం.1, ప్లాట్ నం.11 150 గజాల వరకు గల స్థలాన్ని కాలనీ ఏర్పడిన నాటి నుంచి పార్క్‌కు కేటాయిస్తున్నట్లు జీహెచ్ఎంసీకి అనుకూలంగా రిజిస్ట్రేషన్ చేశారు.

స్థానికుల అవసరాల మేరకు ఆ స్థలంలో మినీ రిక్వెస్ట్ బస్‌స్టాప్ నిర్మించారు. బస్సుల రాకపోకలు నిలిచిపోవడంతో ఆ స్థలం నిర్మానుష్యంగా మారింది. ఇదే అదునుగా చూసుకొని కొందరు కాజేసేందుకు పన్నాగం పన్నారు. కానీ జీహెచ్ఎంసీ అధికారులు ప్రహరీ తో పాటు గేటును ఏర్పాటు చేసేందుకు నిధులు విడుదల చేశారు. సంబంధిత కాంట్రాక్టర్ పనులు చేస్తున్న తరుణంలో ప్రైవేట్ వ్యక్తులు పనులను అడ్డుకున్నారు. ఇంజినీరింగ్ అధికారులు ప్రొటెక్షన్ కల్పించాలని కోరుతూ పేట్ బషీరాబాద్ పోలీసులను ఆశ్రయించారు.

ఇదే విషయాన్ని డీసీ నరసింహను వివరణ కోరగా కాలనీ ఏర్పాటున నాటి నుంచి ఆ స్థలం పార్కుదే అని, కొందరు కోర్టును ఆశ్రయించినప్పటికీ తీర్పు పార్కు స్థలానికి అనుకూలంగానే వచ్చిందన్నారు. ప్రభుత్వానికి సంబంధించిన పార్క్ స్థలాన్ని కాపాడుకుంటామని తెలిపారు.

## దూలపల్లి పీఏసీఎస్ విస్తరణకు సహకరించండి



పీఏసీఎస్ సభ్యులకు ఐఎస్ఓ సర్టిఫికెట్ అందజేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

కుత్బుల్లాపూర్ : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి మున్సిపాలిటీ పరిధి దూలపల్లి పీఏసీఎస్ కార్యవర్గ సభ్యులు మంగళవారం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చేతుల మీదుగా ఐఎస్ఓ సర్టిఫికెట్‌ను అందుకున్నారు. దూలపల్లి పీఏసీఎస్ సంఘం సభ్యులు 556 సభ్యులు, 2,334 ఖాతాదారులకు సేవలందిస్తూ ప్రస్తుత పాలకవర్గం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం ద్వారా దుండిగల్ మండల కార్యాలయం సమీపంలో కేటాయించిన 2 ఎకరాల్లో నాబార్డ్ సహకారంతో 15,710 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల 5 గోదాములు నిర్మించినట్లు సంఘం సీఈవో టీ కృష్ణ సంఘానికి సంబంధించి లాభనష్టాల గురించి మంత్రికి వివరించారు. సంఘం విస్తరణతో పాటు ఇతర సదుపాయాల కోసం మరో 2 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించేలా చొరవ తీసుకోవాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న పలు సేవ సామాజిక కార్యక్రమాలతో పాటు సంస్థ విస్తరణ సేవలను గుర్తిస్తూ ప్రభుత్వం అందించిన ఐఎస్ఓ సర్టిఫికెట్‌ను సంఘం చైర్మన్ గరిసె నరేందర్ రాజు,ం పాలకమండలి సభ్యులు మంత్రి చేతల మీదుగా అందుకున్నారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు రవీందర్ రెడ్డి, డైరెక్టర్లు, సీహెచ్ మధుసూదన్, పీ మల్లేశ్, జీ.కృష్ణ, డీ నరేందర్, సీహెచ్ శ్రీనివాస్, బీ మధుసూదన్, ఎం మదన్ రావు, ఏ సత్యనారాయణ పాల్గొన్నారు.

## కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో మంగళవారం కూరగాయల ధరలు (కేజీ–రూపాయలు). టమాట 27, వం కాయ 23, బెండ 45, పచ్చిమిర్చి 50, బజ్జి మిర్చి 23, కాకర 45, బీర 35, క్యాబేజి 21, ఫ్రెంచ్ బీన్స్ 95, క్యారెట్ 40, కాలీఫ్లవర్ 30, దొండ 35, చిక్కుడు 55, గోరుచిక్కుడు 40, బీట్‌రూట్ 28, క్యాప్సికం 67, ఆలు 25, కీర 23, దోస 15, సోర 15, పొట్లకాయ 23, కంద 45, ఉల్లిపొరక 45, ఉల్లిగడ్డ 25, మామిడికాయ(1) 15 నుంచి 20, అ రటికాయ 10 నుంచి 12, చామగడ్డ 28, ముల్లంగి (1) 4 నుంచి 5, మొ రంగడ్డ 30, గుమ్మడికాయ 30, ని మ్మకాయలు(12) 24 నుంచి 30, ము నగకాయ(1) 8 నుంచి 10, పొ ప్పడికాయ 40, పుట్టగొడుగులు 40, ఎండుమిర్చి 160, అల్లం 80, వెల్లుల్లి 140, చింతపండు 160, కరివేపాకు 60 గా ఉన్నాయి. ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు అమలులో ఉం టాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

## ఎంఎస్సీ మాలిక్యులర్ & హ్యూమన్ జెనెటిక్స్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ : ఓయూ పరిధిలోని ఎంఎస్సీ మాలిక్యులర్ అండ్ హ్యూమన్ జెనెటిక్స్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఓయూ డైరెక్టరేట్ ఆఫ్ పీజీ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఐ పాండురంగారెడ్డి ఓ ప్రకటనలో తెలిపా రు. కేంద్ర బయోటెక్నాలజీ విభాగం(డీబీటీ)ప్రాయోజితం చేస్తున్న ఈ కోర్సును ఓయూ పరిధిలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ జెనెటిక్స్ అండ్ హాస్పిటల్ ఫర్ జెనెటిక్ డిసీజెస్ అందిస్తోందని చెప్పారు. గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఆఫ్ బ యోటెక్నాలజీ(జీఏటీ–బీ) పరీక్షలో అర్హత సాధించిన వా రు ఈకోర్సులో చేరేందుకు అర్హులన్నారు.ఆసక్తి ఉన్న అభ్యర్థులు వచ్చే నెల 9వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు ఓయూ వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చన్నారు.

## వివిధ కోర్సుల పరీక్షా ఫలితాల విడుదల

ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేశారు. ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ పరీక్షల రీవాల్యుయేషన్ ఫలితాలతోపాటు ఎంపీఈడీ నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, సీఏ అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలు విడుదల చేశామన్నారు.